# కాన్ఫ్లిక్ట్

"కనీసం ఆమె పేరు చెబుతారా?" అడిగింది ఆమె.

"ఎవరి పేరు?" ఆమె ఎవరి గురించి అడుగుతున్నదో తెలిసి కూడా తెలియనట్టుగా ప్రశ్నించాడు అతడు.

"నాతోపాటు మీ జీవితాన్ని పంచుకుంటున్న ఆమె పేరు?" అన్నది ఆమె అతడికి స్పష్టంగా అర్థమయ్యేలా.

అతడు మౌనాన్ని ఆశ్రయించాడు.

మాటలు లేవు. మౌనం రాజ్యమేలుతోంది. ఘనీభవించిన నిశ్శబ్దం. అంతా ఫ్రీజ్.

మొదట్లో నమ్మలేదు. కానీ పెళ్లీడుకు ఎదిగిన కూతురు రేవతి కూడా చెప్పిన తర్వాత నమ్మకుండా ఉండలేకపోయింది.

రాత్రివేళ ఒక రెస్టారెంట్‌లో నుంచి చెయ్యి చెయ్యి పట్టుకుని ఇద్దరూ నవ్వుకుంటూ బయటకు వస్తున్నారట. చెప్పింది.

"నువ్వు సరిగ్గా చూశావా?" కూతురిని అడిగింది తల్లి వందన.

"స్పష్టంగా చూశాను. సందేహం లేదు. ఆయన నాన్న. పక్కన ఆమె ఎవరో తెలీదు. ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదు" అని చెప్పింది కూతురు రేవతి.

భూమి బద్దలై తను అందులో కూరుకుపోతున్నట్టు అనిపించలేదు కానీ, తనమీద పిడుగుపడినట్టుగా ఫీలయ్యింది వందన.

అవును. ఎన్నడూ ఊహించలేదు. తన భర్త రామచంద్ర ఇలాంటి మనిషా?

పెళ్లయిన తొలిరోజుల్లో నిన్ను విడిచి బతకలేను వందనా అని ఎన్నోసార్లు తన కళ్లలోకి చూస్తూ చెప్పిన భర్త. ఈరోజు మరో ఆడదాని చెయ్యి పట్టుకు తిరుగుతున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది. తనమీద ఉన్న ఆ ప్రేమ, ఇష్టం ఏమైనట్టు?

వందన తాత్సారం చెయ్యలేదు. ఆ రాత్రి పడక గదిలో ఇద్దరి మధ్యన మాటల యుద్ధం జరిగింది.

రామచంద్ర సరైన జవాబు చెప్పలేదు. దాటేశాడు.

"ఈ సంసార జీవితాన్నేనా నేను కోరుకున్నది?" అడిగింది.

"ఇప్పుడేం జరిగింది?"

"ఒక ఆడదాని జీవితంలో ఏది జరగకూడదో అదే జరిగింది. అందుకే అడుగుతున్నాను. చెప్పండి..పెళ్లినాటి ప్రమాణాన్ని మరచిపోయారా?" నిలదీసింది.

"ప్రమాణమా? ఇదేమిటి కొత్తగా?" ఆశ్చర్యపడుతున్నవాడిలా అడిగాడు.

"కొత్తగా కాదు. పాత ప్రమాణం. ధర్మేచ..అర్థేచ..కామేచ..మోక్షేచ..నాతిచరామి" అంటూ ప్రమాణం చేశారు కదా పెళ్లిలో. అప్పుడు మీరు అన్న ఆ మాటలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటున్నాయి. వాటికి విలువ లేదా? అవన్నీ వట్టి మాటలేనా?"

రామచంద్ర తేలిగ్గా నవ్వి, "అదా! అదంతా పెళ్లి తంతు. చాలా సహజమైనది" అన్నాడు.

"అయితే మీ దృష్టిలో పెళ్లి తంతుకు విలువ లేదా?" రోషంగా అడిగింది.

అతను మాట్లాడలేదు. మాటలను వెతుక్కుంటున్నవాడిలా ఉండిపోయాడు.

"హు! నేనేమీ చెయ్యలేనని, మీ నీడలో బతుకుతున్నామనేగా ఈ ధీమా అంతా!" అన్నది.

"పోనీ అలాగే అనుకో!" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఛీ! మిమ్మల్ని గౌరవంగా పిలవాలంటే అసహ్యంగా ఉంది" అన్నది నిర్లక్ష్యంగా చూస్తూ.

"అలా అయితే నువ్వు అని పిలువు. నేనేమీ అనుకోను."

"అవును. అన్నీ వదులుకున్నారుగా"

"అందుక్కాదు. తను నన్ను అలాగే పిలుస్తుంది" నవ్వుతూ అన్నాడు రామచంద్ర.

"అంత క్లోజయ్యిందా? అదలా పిలవటాన్ని నేను సహించలేను" అన్నది వందన.

"కొంచెం గౌరవంగా మాట్లాడు వందనా..కోపంలో వివేకాన్ని పోగొట్టుకోకు. అయినా నువ్వు ద్వేషించే నన్ను మరో మనిషి ఎలా పిలిస్తే నీకేం?" అని అడిగాడు.

"మీరు నా మెళ్లో తాళి కట్టినప్పుడే నాకు కొన్ని హక్కులు, బాధ్యతలు సంక్రమించాయి. వాటిని నేను వదులుకోను. మీరు నా భర్త. నా భర్త గౌరవం నాకు ముఖ్యం" అన్నది.

అతడు నవ్వుతూ థ్యాంక్స్ చెప్పాడు.

"థాంక్స్ చెప్పటం కాదు. మీరు తక్షణం ఆమెతో మీకు వున్న సంబంధాన్ని రద్దు చేసుకుని బుద్ధిగా వుండండి"

"సాధ్యం కాదనుకుంటాను" అన్నాడు చిన్నగా.

"ప్రయత్నం చేస్తే సాధ్యపడుతుంది. పెళ్లికి ఎదిగిన కూతురు ఇంట్లో వుంది. మమ్మల్ని హర్ట్ చేసి మీరు పొందే సుఖం ఏమిటి?" అన్నది వందన.

"అదేమిటో నాకు తెలుసు. అందుకే వదులుకోలేకపోతున్నాను. నావైపు నుంచి ఆలోచించు. పోనీ విడిపోదామా?" అన్నాడు చిన్నగా ఆమె మొహంలోకి చూస్తూ.

"ఈ వయసులోనా? ఛీ!"

"అలా అనకు. వయసుతో నిమిత్తం లేదు. ఈ వయసులో కూడా ఇద్దరికీ మనశ్శాంతి

కావాలి. ఈ వయసులో ఇలాంటి సమస్య ఎదురవుతుందని నేను అనుకోలేదు. కానీ ఎదురైంది. ఏదో విధంగా ఫేస్ చెయ్యాలి. ఒక అరలో రెండు కత్తులు ఇమడవని తెలిసినప్పుడు, ఏదో ఒక కత్తిని తీసెయ్యాలి. ఆ కత్తివి నువ్వే అయితే నేను కోరుకున్న సుఖం నాకు దక్కుతుంది."

"నువ్వు మనిషివి కాదు" అని పడక గదిలోనుంచి విసురుగా బయటకు వెళ్లిపోయింది.

అతనొక్కడే ఆ గదిలో.

వేగంగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యానును చూస్తూ పడుకున్నాడు. నిద్ర రాదని తెలుసు.

ఒకటే ఆలోచనలు.

తన ఇంట్లో తనే నరకాన్ని సృష్టించుకున్నాడా?

అవును. నిజమే. ఇందులో వందన తప్పు లేదు. ఏ ఆడదైనా ఇలాగే ప్రవర్తిస్తుంది. హర్షించదు.

అన్నీ తెలుసు. కానీ తను ఆమెను వదులుకోలేడు. ఇంద్రాణి ఆకర్షణకు తను పూర్తిగా లొంగిపోయాడు. ఆమె ఆకర్షణకు తను బందీ.

ఆమె గుర్తుకు రాగానే, ఆమె రూపం కనులముందు కదలాడగానే తను సృష్టించుకున్న నరకాన్ని పూర్తిగా మరిచిపోయాడు.

అందమైన రూపం. నక్షత్రాల కాంతిని నింపుకున్న కళ్లు, వెన్నెల జల్లులాంటి చిరునవ్వు, మార్దవం నింపుకున్న మాటలు. అన్నిటినీ మించి తనమీద చూపుతున్న ప్రేమ, ఇష్టం.

నరకాన్నయినా భరించగలడు కానీ ఇంద్రాణిని తను వదులుకోడు. భర్తనుంచి విడిపోయిన ఇంద్రాణి తన తోడు కోరుకున్నది. తను అంగీకరించాడు.

ఇంద్రాణి తలపులతో రామచంద్ర ఎప్పటికో నిద్రలోకి జారిపోయాడు.

వందన గట్టి పట్టు మీదనే ఉన్నది. మళ్లీ పడక గదిలోకి అడుగుపెట్టలేదు. కూతురు కూడా మాట్లాడటం మానేసింది తండ్రితో. తల్లీ కూతుళ్లు అతనింట్లో అతడిని ఒంటరి వాడిని చేశారు. అయినా అతడు బాధపడలేదు. తన ఇంట్లో ఏర్పడిన వెలితిని అతడు ఇంద్రాణి సమక్షంలో పూరించుకుంటున్నాడు.

ఎన్నాళ్లిలా?

ఒకరోజు తెరపడింది.

మధ్యవర్తి వచ్చాడు. ఇంతకుముందు పెళ్లిచూపులు చూసినవాళ్లు కబురు చేశారు. రేవతి నచ్చిందట. రెండు లక్షలు కట్నం ఇస్తే రేవతిని చేసుకుంటారు. మధ్యవర్తి వచ్చినప్పుడు రామచంద్ర ఇంట్లో లేదు. అతను వెళ్లినాక వచ్చాడు.

ఈ విషయాన్ని భర్తతో చెప్పక తప్పదు. మంచి సంబంధం. వదులుకోకూడదు. బాగా ఆలోచించి, వందన తన మౌనాన్ని వీడి, భర్త దగ్గర చేరి విషయాన్ని వివరించింది.

"రెండు లక్షలా?" అన్నాడతను.

"అవును. తప్పదు. మన అమ్మాయి సుఖపడుతుంది."

"పైన ఖర్చులకు ఇంకో రెండు లక్షలు కావాలి. మొత్తం నాలుగు లక్షలు. నా దగ్గర లక్షకు మించి లేదు. మిగిలిన మూడు లక్షలు?"

"ఎవర్నయినా అడగండి"

అతను పెద్దగా నవ్వాడు.

"ఎవరిస్తారు?"

"ఎవరైనా సరే! ప్రయత్నం చెయ్యండి ముందు" ఎలాగైనా ఈ సంబంధాన్ని వదులుకోవద్దనే సూచన కనపడుతోంది ఆమెలో.

అతను హామీ ఇవ్వలేదు.

"నాలుగు రోజుల్లో విషయం చెప్పమన్నారు" చివరగా అన్నది అతడు బయటకు వెళుతున్నప్పుడు.

కూతురికి కూడా టెన్షన్‌గా ఉంది. పెళ్లికొడుకు రేవతికి కూడా బాగా నచ్చాడు.

తనమీద కోపంతో, తండ్రి ఈ సంబంధాన్ని డబ్బులేదనే వంకతో వదులుకుంటాడేమోననే అనుమానం రేవతిని వెంటాడింది. తల్లిక్కూడా అదే ఆలోచన.

ఆ రాత్రి అతడు బాగా ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. అతడు ఊహించని విధంగా ఆమె పడక గదిలోకి ప్రవేశించింది. తల్లి సమయానుకూలంగా ప్రవర్తిస్తోందని కూతురు అనుకుంది.

మళ్లీ భర్తతో మాట్లాడటానికి వందనకు అభిమానం అడ్డుపడింది. తనకు బాగా పరిచయం ఉన్న పడకగదీ, భర్తా కొత్తగా అగుపడుతున్నారు.

తమ మధ్య తలెత్తిన కాన్ఫ్లిక్ట్ తమ కూతురి భవిష్యత్తుకు కత్తెర కాకూడదు. కూతురి భవిష్యత్తు తనకు ముఖ్యం.

ఇల్లు తగలబడిపోతున్నప్పుడు సగం కాలిన వస్తువులను కూడా మంటల్లో నుంచి బయటకు లాక్కుంటారు. పూర్తిగా కాలిపోనివ్వరు. జీవితమూ అంతే! కొంత నాశనమైందని పూర్తిగా నాశనం చేసుకోవటం అవివేకం.

ఆమె ఆలోచనలను, సందిగ్ధతను చదివినవాడిలా అతను నవ్వాడు.

"భయపడకు. నువ్వు చెప్పిన ఈ సంబంధానికే మన అమ్మాయి పెళ్లవుతుంది"

నమ్మలేనట్టు చూసింది విస్మయంగా.

"అవును. డబ్బు దొరికింది. నాలుగు లక్షలు"

"ఎవరిస్తున్నారు?" ఆత్రుతగా అడిగింది.

అతడు నవ్వాడు కానీ చెప్పలేదు.

ఆమెకు కోపం రాబోయి ఆగిపోయింది.

"ఎవరో చెప్పండి?" అన్నది గట్టిగా.

"రెండో కత్తి" అని పెద్దగా నవ్వాడు.

"నిజంగానా!" అన్నది నమ్మలేనట్టు.

"అవును. విషయం చెప్పాను. డబ్బు లేదని కూడా చెప్పాను. అప్పుడు ఆ స్త్రీ మూర్తి–

"మీ కూతురు నా కూతురు కాదా! నాకు పిల్లలు లేరు. రేవతిని నా కూతురనే అనుకుంటాను. డబ్బు గురించి ఆలోచించవద్దు. ఆ నాలుగు లక్షలూ నేనిస్తాను. పెళ్లి జరిపించండి. ఆ డబ్బును నాకు తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు" అని చెప్పింది.

సరేనన్నాను.

అప్పుడు వందన మొహంలో రంగులు మారాయి. మొహాన ఏదో రంగురంగుల చక్రాన్ని ఫోకస్ చేస్తూ తిప్పుతున్నట్టుగా...

"కనీసం ఆమె పేరు చెబుతారా?" అడిగింది ఆమె.

"ఎవరి పేరు?" తెలిసినా ప్రశ్నించాడతడు.

"నాతోపాటు మీ జీవితాన్ని పంచుకుంటున్న ఆమె పేరు?" అన్నది అతడికి స్పష్టంగా అర్థమయ్యేలా.

అతడు మౌనాన్ని ఆశ్రయించాడు

"చెప్పండి?" రెట్టించింది ఆమె.

"ఎందుకు?" అనడిగాడు.

"మనమ్మాయి పెళ్లికి ఆమెను పిలవండి. తప్పకుండా రమ్మని చెప్పండి" అన్నది నవ్వి.

ఎంత స్వార్థమని అతడు లోలోపల అనుకున్నాడు.

"ఒక్క విషయం!" మళ్లీ అన్నది.

"ఏమిటి?"

"దయచేసి ఆమెను నాకు పరిచయం చెయ్యొద్దు. పెళ్లికి వచ్చిన ఎంతోమందిలో ఆమె ఒకామె. అంతే"

నవ్వి సరేనంటూ తల ఊగించాడు.

ఇంకొంచెం సేపటికి రాత్రి పన్నెండు గంటలను సూచిస్తున్న గోడ గడియారంలా వాళ్లిద్దరూ బెడ్‌మీద కలిసి పడుకున్నారు.

(సాక్షి-ఫన్‌డే నవంబరు 1, 2009)